క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధిద్దాం

• జనపనార సంచులు పంపిణీ



మహిళలకు జనపనార సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్లాస్టిక్‌ను నిషేధించాలని, వీటి వాడకంతో మానవాళికి అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని పలువురు వక్తలు వెల్లడించారు. పట్టణంలోని ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ గాస్పెల్ సంస్థల సహకారంతో టిడ్కో గృహాల వద్ద పలువురు మహిళలకు జనపనార సంచులు మంగళవారం పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తుందని ప్రజలు సైతం ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వి ఎడ్వర్డ్, పాస్టర్ స్టీఫెన్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేస్తున్న కౌన్సిలర్ నౌషాద్ బేగం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘమని, ఉడతాభక్తిగా తాను విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ బూత్ కమిటీ మేనేజరు సయ్యద్ జమీర్ బాషా, మునీర్, అహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

కావలి రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో చోటు చేసుకుంది. 1వ పట్టణ ఎస్సై పి.జమాల్ వల్లి సమాచారం మేరకు కొండాపురం మండలం చిన్నపావని గ్రామానికి చెందిన కొమ్మి అంజయ్య (75) ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు దిగి వెళ్తున్న క్రమంలో కావలి నుంచి కందుకూరు వెళ్తున్న బస్సు వేగంగా వచ్చి ఢీకొనడంతో కాలు నుజ్జునుజ్జైంది. దీంతో స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు రాపూరు పరామర్శ



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమశిల: అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సత్యాల పెంచలయ్యను జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయన తల్లి చిన్నమ్మ మరణించడంతో వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాలువ నరసింహులు, జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు తిరుమలరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మలినేని చంద్రశేఖర్, లక్ష్మీదేవమ్మ, జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు డానియేలు తదితరులు చిన్నమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

అందుబాటులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ



పాతాళపల్లిలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవలను ప్రారంభిస్తున్న అధికారులు

సోమశిల: పాడి రైతులకు ఎంతో సౌలభ్యంగా ఉండేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక తెలిపారు. మంగళవారం అనంతసాగరం, మర్రిపాడు, చేజర్ల మండలాలకు మంజూరైన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంచార పశు వైద్యశాల సిబ్బంది శివాజీ, షబ్బీర్, కార్తీక్ ఉన్నారు.

డీసీపల్లిలో 276 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 276 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 278 బేళ్లు రాగా వాటిలో 276 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన 2 బేళ్లలో ఒకటి నో సేల్, ఒకటి నో బిడ్‌గా గుర్తించామని తెలిపారు. వేలంలో 36,996 కిలోల పొగాకు విక్రయం కాగా గరిష్ట ధర కిలో రూ.200 కాగా, కనిష్ట ధర రూ.193 లభించింది. సగటు ధర కిలో ఒక్కింటికి రూ.198.09గా నమోదైంది. 6 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లూ వైరస్.. వైరల్

వాతావరణ మార్పులు, ఫ్లూవైరస్ విజృంభిస్తోంది. దగ్గు, జ్వరాలు దడపుట్టించే స్థాయిలో నమోదవుతున్నాయి. జ్వరంతో పాటు రోజుల తరబడి తగ్గని దగ్గు కారణంగా బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే దగ్గు నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉన్నా, అవగాహన లేకపోవడంతో మందుల షాపుల్లో ఇచ్చే దగ్గు సిరప్‌లు, యాంటీబయాటిక్ మందులు ఇష్టారాజ్యంగా వాడుతూ ప్రాణాంతక పరిస్థితులు తెచ్చుకుంటున్నారు.

• దడపుట్టిస్తున్న పొడిదగ్గు, జ్వరం
• రోజు రోజుకు పెరుగుతున్న బాధితులు
• కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కావలి ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ విభాగాల వద్ద తమ వంతు కోసం పరీక్షలు కోసం ఉన్న రోగులు



కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్‌గా చేరి చికిత్స పొందుతున్న బాధితులు

కావలి/బిట్రగుంట: కావలి డివిజన్‌లో ఫ్లూ వైరస్.. వైరల్ అవుతోంది. సాధారణ వైరల్ ఫీవర్స్‌కి భిన్నంగా దగ్గుతో కూడిన జ్వరం రావడం, జ్వరం తగ్గినా రోజుల తరబడి పొడి దగ్గు తగ్గకపోవడంతో బాధితులు అల్లాడిపోతున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో వైరల్ జ్వరాలు విజృంభించి ఫిబ్రవరి రెండో వారం నుంచి తగ్గుముఖం పడుతాయి. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా 'ఇన్‌ఫ్లుయెంజా' వైరస్‌లో వచ్చిన మార్పుల కారణంగా ఫిబ్రవరి రెండో వారం నుంచి జ్వరం, దగ్గు కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. నియోజకవర్గంలోని కావలి పట్టణం, కావలి రూరల్, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో వేల సంఖ్యలో దగ్గు, జ్వరం బాధితులు ఉన్నట్లు అంచనా. కావలి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అల్లూరులోని ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ క్లస్టర్ ఆస్పత్రులతో పాటు కావలి రూరల్ మండలం తుమమలపెంట, సర్వాయపాళెం, బోగోలు మండలం కోవూరుపల్లి, దగదర్తి, తురిమెర్ల, అల్లూరు మండలం ఇస్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలైన దగ్గు, జ్వరం బాధితులు 'క్యూ' కడుతున్నారు. ఒక్క కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికే రోజూ 100 మందికి పైగా బాధితులు వైద్యం కోసం వస్తున్నారు. స్థోమత ఉండి దగ్గు తీవ్రత అధికంగా ఉండడంతో ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. చాలా మంది సొంతంగా మందుల షాపులపై ఆధారపడి సొంత వైద్యం చేసుకుంటున్నారు.

దగ్గుతోనే ఎక్కువ ఇబ్బంది

వాతావరణ మార్పులు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణంగా జ్వరం, దగ్గు ప్రారంభమవుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో జ్వరం తగ్గినా దగ్గు మాత్రం తగ్గడం లేదు. నెల రోజుల వరకూ దగ్గు తగ్గకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వృద్ధులు, ఊబకాయులు, చక్కెర వ్యాధిగ్రస్థుల్లో దగ్గు ఒక పట్టాన తగ్గడం లేదు. నెల రోజుల పాటు దగ్గు తగ్గకపోవడంతో దగ్గు సిరప్‌లు ఇష్టారాజ్యంగా వాడుతున్నారు. సాయంత్రం పూట ఎక్కువగా దగ్గు వస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. విపరీతమైన దగ్గు కారణంగా గొంతు, పక్కటెముకల్లో నొప్పి కూడా వస్తున్నట్లు వాపోతున్నారు.

జాగ్రత్తలతోనే నివారణ

• జ్వరం, దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సొంతం వైద్యంపైన, మందుల షాపులపైన ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి.
• వీలైనంత విశ్రాంతి తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు చేతులు తరచుగా కడుక్కోవాలి, మాస్క్ ధరించాలి.
• యాంటీబయాటిక్ మందులు, దగ్గు సిరప్‌లు ఇష్టారాజ్యంగా వాడకుండా వైద్యులు సూచించిన మందులే వినియోగించాలి.
• మంచు, పొగ, దుమ్ము ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే మాస్క్ వినియోగించాలి.
• ఆస్తమా, షుగర్ వ్యాధి ఉన్నవాళ్ల దగ్గు తీవ్రత పెరుగుతున్నట్లు అనిపించినా, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

జ్వరం, దగ్గు, నీరసం



నేను కూలి పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాలుగు రోజుల నుంచి జ్వరం, దగ్గు ఉండడంతో నీరసం వచ్చేసింది. మందుల షాపుకెళ్లి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఆరోగ్యం క్షీణించడంతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రెండు రోజుల క్రితం వెళ్లాను. వైద్యులు పరీక్షలు చేసి ఆస్పత్రిలోనే బెడ్ ఇచ్చి ఉండమన్నారు. రోజూ డాక్టర్లు, నర్సులు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇప్పుడు పర్వాలేదు. దగ్గు చాలా వరకు దగ్గింది. జ్వరం తగ్గుతుంది. పర్వాలేదు.

– ఖాదర్ బాషా, బాధితుడు, కావలి

కేసులు తగ్గుతున్నాయి



డివిజన్ పరిధిలో గత నెలతో పోలిస్తే కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఫిబ్రవరి 20వ తేదీ పైనుంచి నెలాఖరు వరకు రోజుకు 150 దగ్గు, జ్వరం కేసులు వచ్చాయి. ఎండలు పెరుగుతుండటం, చలి తగ్గుతుండటంతో వైరస్ ప్రభావం కూడా తగ్గిపోతుంది. ఇది సాధారణంగా వాతావరణ మార్పుల క్రమంలో వచ్చే వైరస్ మాత్రమే.

– డాక్టర్ కామంచి సుబ్బారావు, సూపరింటెండెంట్, ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి, కావలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఎస్సై ఎం.శివశంకర్ రావు హెచ్చరించారు. బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరేందుకు ఆత్మకూరులో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మెయిన్ బజార్, కళాశాలల రహదారుల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

• తొమ్మిది మందికి గాయాలు

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి తొమ్మిది మందిని గాయపరిచిన ఘటన మంగళవారం జరిగింది. ఉదయం గ్రామ వీధుల్లో పిచ్చికుక్క తిరుగుతూ దారిన పోతున్న వారిపై దాడిచేసి గాయపరిచింది. ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు పామూరు వైద్యశాలకు తరలించారు. గ్రామస్తులు కుక్కను వెంబడించి చివరకు హతమార్చడంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు.

870 పశువులకు గాలికుంటు టీకాలు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో 870 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ముందస్తుగా సిబ్బంది వేసినట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. ఆయన మంగళవారం వరికుంటపాడు, విరువూరు గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. ఈ నెల చివరి వరకు ఉచితంగా టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పన్నులు నూరు శాతం వసూలు చేయండి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ఆదినారాయణరావు

అల్లూరు: మండలంలోని పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూలు చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కావలి డివిజనల్ పంచాయతీ అధికారి ఆదినారాయణరావు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో డీఎల్‌పీఓ ఇంటి పన్నుల బకాయలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 64 శాతం మాత్రమే ఇంటి పన్నులను వసూలు చేశారని, ఇంకా సుమారు రూ.15 లక్షల మేర బకాయలను ఉన్నాయన్నారు. మార్చి నెలాఖరులోగా వాటిని పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. నాన్ ట్యాక్స్ కలెక్షన్, ఇంటి కుళాయలు, పంచాయతీ షాపులు, చేపల చెరువులు, లైబ్రరీలకు సంబంధించి బకాయిలను కూడా వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ వీరేంద్ర, ఏఓ మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు అమ్ముకోవద్దు

సోమశిల: రైతులు ధాన్యాన్ని దళారుల వద్ద అమ్ముకుని మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనంతసాగరం మండలం రేవూరు రైతు భరోసా కేంద్రంలో తహసీల్దారు అన్నదాత వెంకటరమణతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యం రూ.17,560, బి గ్రేడ్ రకం రూ.17,360 పుట్టి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలపాటి నాగార్జునరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ భక్తవత్సలంబాబు, రైతులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా కానుగల

సోమశిల: హ్యూమన్ రైట్స్ అఫెన్స్ కంట్రోల్ కమిటి జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పాతాళపల్లికి చెందిన కానుగల వెంకటరమణయ్యను ఎంపిక చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించడంతో బాధ్యతగా పనిచేస్తానని, జాతీయ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ మద్దులేటికు ధన్యవాదాలు తెలిపారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఉదయగిరి: ఉదయగిరి మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని కృష్ణారెడ్డిపల్లికి చెందిన పలువురు పసుపు రైతులు మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ మండలంలో సుమారు 400 ఎకరాల్లో పసుపు పంట రైతులు సాగు చేశారన్నారు. ప్రస్తుతం రైతులు పసుపు తవ్వకాలు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది పంట ప్రారంభం నుంచి తెగుళ్ల సోకడంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయని, రైతులను ఆదుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

• ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
• పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



కలిగిరి మోడల్‌స్కూల్‌లో ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేస్తున్న సెంటర్ చీఫ్ శ్రీనివాసులు

ఉదయగిరి: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. ఉదయగిరి నియోజకవర్గంలో పలు జూనియర్ కళాశాలలతో పాటు మోడల్ పాఠశాలల్లో ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి గదిలో 24 మంది చొప్పున విద్యార్థులను పరీక్ష రాసేందుకు వసతులు ఏర్పాటు చేశారు. వింజమూరులోని 3 కేంద్రాల్లో 1,550 మంది, ఉదయగిరిలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో 378 మంది, దుత్తలూరులో 163 మంది, కొండాపురంలో 330 మంది, కలిగిరిలో 274 మంది , సీతారామపురంలో 317 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. విద్యార్థులను 8.30 గంటలకు పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు. 9 గంటలకు మించి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు.

పకడ్బందీగా పరీక్షలు

మర్రిపాడు: మర్రిపాడులోని జూనియర్ కళాశాలలో బుధవారం జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. కళాశాలలో ఈ ఏడాది 225 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్ష హాజరవుతున్నట్లు తెలిపారు. నందవరం మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, అనంతసాగరం, మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రానికి హాజరవుతారన్నారు.

సంగం: బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి తెలిపారు. గురుకుల కళాశాల కేంద్రంగా 213 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. మంగళవారం సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి గురుకుల కళాశాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, ప్రిన్సిపల్



పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

అన్ని ఏర్పాట్లు పూర్తి



ఉదయగిరి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు 9 గంటల్లోపే పరీక్ష కేంద్రం లోపలికి ప్రవేశించాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. పరీక్షలు నిరంతరం పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఉన్నాయి.

కిరణ్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

నులిపురుగును నివారిద్దాం

ఆత్మకూరురూరల్: నులిపురుగులతో అనారోగ్య సమస్యలు వస్తాయని వాటిని నివారిద్దామని మండల వైద్యాధికారి రాకేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషాకుమారి తెలిపారు. మంగళవారం మండలంలో 51 పాఠశాలలు, 57 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3,871 మంది చిన్నారులకు 3,662 మందికి ఈ మాత్రలు మింగించామని తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నువ్వూరుపాడు, అశ్వనీపురం, పాతజంగాలపల్లి పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. హెచ్‌ఎం జావేద్, వాసుదేవ, సంక్షేమ సహాయకుడు రవూఫ్, ఏఎన్‌ఎం పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సోమశిలలో..

సోమశిల: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో అనంతసాగరంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ మాటిరెడ్డి బాలకృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీవార్మింగ్ మాత్రలు పంపిణీ

అనుమసముద్రంపేట: మండలంలో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో డాక్టర్ పీ రాంతున్నిసా బేగం, డాక్టర్ జ్యోతిరాణి మంగళవారం చిన్నారులకు డీ వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. చిరమన పీహెచ్‌సీ పరిధిలో 2,345 మంది చిన్నారులు ఉండగా 2,217 మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



నువ్వూరుపాడులో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

నులి పురుగుల నివారణ దినోత్సవం

సంగం: సంగం బాలికల గురుకుల పాఠశాలలో డాక్టర్ ప్రతిమ మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ విద్యార్థులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మహాలక్ష్మి, వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

చేజర్లలో..

చేజర్ల: మండలంలోని పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు చేజర్ల సీహెచ్‌సీ డాక్టర్ ప్రమీలారాజకుమారి తెలిపారు. మంగళవారం 4,270 మంది పిల్లలకు ఆగాను 4068 మందికి పిల్లలకు మాత్రలు మింగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య, ఏవీ రమణమ్మ, బి నరసమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత, పౌష్టికాహారం లోపం

మర్రిపాడు: నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల, రక్తహీనత, పౌష్టికాహారం ఏర్పడుతుందని వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్ కల్పన, డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. మండలంలో మంగళవారం అంగన్‌వాడీలు, పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాల, కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది కొండారెడ్డి, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి మాత్ర మింగిస్తున్న మండల వైద్యాధికారిణి శివకల్పన

ఆరు నెలలకొకసారి మాత్రలు మింగాలి

ఉదయగిరి: ప్రతి ఆరు నెలలకొకసారి అల్బెండజోల్ మాత్రలు మింగాలని మండల వైద్యాధికారిణి శివకల్పన, ఎంపీడీఓ బిజాక్‌ప్రవీణ్, ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంగళవారం ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గౌస్‌బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

7 వేల మందికి మాత్రల పంపిణీ

వింజమూరు: మండలంలోని 120 విద్యాసంస్థల్లో ఏడు వేల మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. మంగళవారం మండలంలో 58 అంగన్‌వాడీలు, 62 పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందించామన్నారు. ఎంపీడీఓ ప్రసన్న, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రత ద్వారా వ్యాధులు దూరం

వరికుంటపాడు: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా పలు వ్యాధులను దూరం చేసుకోవచ్చని మండల వైద్యాధికారిణి కరీష్మా అన్నారు. మంగళవారం మండలంలో 4,472 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, ఏఎన్‌ఎం జానకి తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు మిగేస్తున్న ఎంఈఓ నాగేశ్వరరావు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్: ప్రస్తుత ప్రబలుతున్న వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ అభివృద్ధి అధికారి కనకదుర్గాభవాని తెలిపారు. మండలంలోని సర్వాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, ఎంఈఓ శ్రీధర్, హెచ్‌ఎం పీవీరమణ, వైద్యాధికారి హరికృష్ణ, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అల్లూరులో..

అల్లూరు: మండలంలోని పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎంఈఓ నాగేశ్వరరావు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోసచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

9,300 మందికి మాత్రల పంపిణీ

బిట్రగుంట: కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సీమా తబుస్సమ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, తిప్పలోని జూనియర్ ఇంటర్ కళాశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. మండలంలో 10,117 మందికి మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా తొలి రోజు 9,300 మందికి మాత్రలు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రముఖ ఎన్‌ఆర్ఐ డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని భట్లువారిపాళెం, మార్తులవారిపాళెం, తెల్లపాడు గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పాలన చేరువైందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు సజావుగా కొనసాగాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా 2024లో మరల వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సినన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.